క్లుప్తంగా

జాతీయ జెండాకు అవమానం

● అవనతం చేయని జీపీ కార్యదర్శి



నెల్లికుదురు : ఇనుగుర్తి మండలంలోని లక్ష్మీపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో సెప్టెంబర్ 17న ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. అయితే ఉదయం ఎగురవేసిన జాతీయ జెండాను సాయంత్రం ఐదు గంటల తర్వాత అవనతం చేయడం మరిచారు. దీంతో మూడ్రోజులుగా జాతీయ జెండా ఎగురుతూనే ఉంది. పంచాయతీ కార్యదర్శి ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పోషకాహారమే కీలకం



డోర్నకల్ : పిల్లలు, మహిళల ఎదుగుదలకు పోషకాహారమే కీలకమని ఐసీడీఎస్ సీడీపీఓ డి.లక్ష్మి తెలిపారు. స్థానిక వీధితో పాటు పెరుమాళ్ల సంకీస గ్రామాల్లో గురువారం నిర్వహించిన డోర్నకల్, గొల్లచర్ల సెక్టార్ పరిధి పోషణ మాసోత్సవ కార్యక్రమంలో సీడీపీఓ పాల్గొని మాట్లాడారు. పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వెంకటరమణ, రేఖాబాయి, సఖి ప్రతినిధి మహేశ్వరి, 1098 ప్రతినిధి అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు గండు సీత, ఏరువ వాణి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలన



సాక్షి ఎఫెక్ట్..

మహబూబాబాద్ అర్బన్ : అనంతారం మోడల్ స్కూల్‌లో 15 రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇదే విషయంపై చీకట్లో మోడల్ స్కూల్ కథనం గురువారం సాక్షిలో ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు మోడల్ స్కూల్ వెనుక వైపు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. డీఈ విజయ్ మాట్లాడుతూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మోడల్ స్కూల్‌కు సంబంధించిన సర్వీస్ తీగలు, కేబుల్ వైర్లు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిందన్నారు. స్కూల్ యాజమాన్యం నూతన సర్వీస్ వైర్లను ఏర్పాటు చేసుకొని విద్యుత్ సరఫరాను సౌకర్యం కల్పించాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి

కేసముద్రం : ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్‌శాఖ అధికారులు ఏర్పాటు చేయాలని గురువారం మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. అధికారులు వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

గీతకార్మికుడికి ఆర్థికసాయం



కురవి : మండల కేంద్రానికి చెందిన కత్తి వెంకన్న కుటుంబ సభ్యులకు గురువారం కిసాన్ పరివార్ సంస్థ అధినేత భూపాల్ నాయక్ రూ.10వేల ఆర్థికసాయం పంపించగా సంస్థ ప్రతినిధులు అందజేశారు. 'మెదడులో గడ్డకట్టిన రక్తం' అనే శీర్షికన సాక్షిలో ఈనెల 10న కథనం ప్రచురితమైన సంగతి విదితమే. స్పందించిన కిసాన్ పరివార్ అధినేత భూపాల్ నాయక్ తన ప్రతినిధులైన సీరోలు, మరిపెడ మండల ఇన్‌చార్జ్‌లు బానోత్ విష్ణునాయక్, ఎడెల్లి వెంకన్నలు రూ.10వేల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు.

ఫిక్స్‌డ్ బాండ్ పత్రాల అందజేత



కేసముద్రం : ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన ప్రైవేట్ టీచర్ మురళీమోహన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా 1997–98 పదో తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు, రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.50వేలను పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ చేసి బాండ్ పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మామిడి అశోక్, వేముల శ్రీనివాస్, సోమయ్య, రవిందర్, మంగ్యా నాయక్, శ్రీనివాస్, వెంకన్న, నాగేంద్రచారి , వెంకటేశ్వర్లు, సతీష్, సంతోష్ పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్..



కురవి : కంచర్ల గూడెం తండాకు చెందిన దివ్యాంగుడు ధరావత్ సాగర్‌కు సామాజిక సేవకుడు గంగరబోయిన రఘు వీల్ చైర్‌ను గురువారం అందజేశారు. కార్యక్రమంలో గూడూరు సంతోష్, కూనం మహేష్, బండారి కార్తీక్ పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలపండి



మహబూబాబాద్ రూరల్ : రాజకీయ నేతలతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘుపతిరెడ్డి



తొర్రూరు: మాట్లాడుతున్న ఎంపీడీఓ నర్సింగరావు



డోర్నకల్: మాట్లాడుతున్న శ్రీనివాసనాయక్

● వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీఓల సమావేశం

మహబూబాబాద్ రూరల్ : ఓటరు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను ఈ నెల 21వ తేదీలోగా స్థానిక జీపీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘుపతిరెడ్డి అన్నారు. రాజకీయ పార్టీల నేతలతో మహబూబాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘుపతిరెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి మహబూబాబాద్ మండలంలోని అన్ని గ్రామాల్లోని జీపీ కార్యాలయాల్లో ఓటర్ల లిస్టు ముసాయిదా జాబితాల ప్రదర్శన ఏర్పాటు చేశామని తెలిపారు. అందులో ఉన్న ఓటర్లు, మార్పులు, చేర్పులు, ఇతర అంశాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని రాజకీయ పార్టీల నేతలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో తేళ్ల శ్రీను, మంగిలాల్, సూర్య, రవి పాల్గొన్నారు.

గార్ల : ఓటర్ల జాబితాను గ్రామపంచాయతీ నోటీస్ బోర్డుల్లో ప్రచురించామని, వాటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 21వ తేదీలోపు ఎంపీడీఓ కార్యాలయంలో తెలపాలని ఎంపీడీఓ మంగమ్మ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు జాబితాపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ జర్పుల సుధాకర్, రాజేష్, నాయకులు దనియాకుల రామారావు, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, కందునూరి శ్రీనివాసరావు, మండ రాముగౌడ్, జి సక్రు, జి దేవా పాల్గొన్నారు.

దోర్నకల్ : ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలిపేందుకు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ నుంచి చేరెడ్డి భిక్షం రెడ్డి, బీఎస్పీ విజయకాంత్ మాత్రమే హాజరయ్యారు. ఎంపీడీఓ శ్రీనివాస నాయక్, ఎంపీఓ మున్వర్ అలీ పాల్గొన్నారు.

కురవిలో..

కురవి : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ముసాయిదా ఓటర్ల జాబితాపై ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు చేశారు. ఎంపీడీఓ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, బీఎస్పీల నాయకులు హాజరయ్యారు. కొన్ని గ్రామాల్లో ముసాయిదా ఓటర్ల జాబితాలోని ఆన్‌లైన్‌లో పేరు కనిపించినప్పటికీ జాబితాలో పేర్లు లేవని తెలిపారు. అందరి సూచనలు, సలహాల మేరకు నివేదికను ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందని ఎంపీడీఓ వీరబాబు తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు తురక రమేష్, మలేడి కోటయ్య, బాలగాని శ్రీనివాస్, బాదె వీరభద్రం, శ్యామల శ్రీనివాస్, ఐతం ఉపేందర్ పాల్గొన్నారు.

అభ్యంతరాల స్వీకరణ

తొర్రూరు : ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ నర్సింగరావు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులతో అభ్యంతరాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలు, తండాలు, వార్డుల వారిగా ఓటరు జాబితాను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఎంపీఓ వేణుమాధవ్, పంచాయతీ కార్యదర్శులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పెద్దవంగర : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఓటర్ల జాబితాపై రాజకీయ నాయకులతో ఎంపీడీఓ వేణుమాధవ్ గురువారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శులు రాజు, పరమేష్, నరేష్, మహేష్, గీతా, రజిత, హేమలత, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని ఎంపీడీఓ వివేక్ రామ్ అన్నారు. గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. అభ్యంతరాలు తెలియజేయాలి.

'ఆశ'ల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తలు

నెహ్రూసెంటర్ : పారితోషకం లేని పనులు చేయించొద్దని, ఆశ కార్యకర్తలకు పనిభారం తగ్గించాలని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పోరాటాల ఫలితంగా ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. అనంతరం డీఎంహెచ్ఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ నాయకులు పోతుగంటి మల్లయ్య, కుమ్మరికుంట్ల నాగన్న, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంకిడి రమణ, వడ్లకొండ ఉపేంద్ర, ఆశాలు సునీత, స్వరూప, నళిని, జ్యోతి, ఆసీయా, రమణ, కమల, సవిత, రాధా, శ్రీలక్ష్మి, నిర్మల, స్వప్న పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

● సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు శ్రీనివాసరావు

గార్ల : ఎలాంటి ఆంక్షలు లేకుండా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో రుణమాఫీకి అర్హత ఉన్న అనేక మంది రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ కాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టారని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి జంపాల శ్రీను, పోతుల నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపొద్దు

మహబూబాబాద్ రూరల్ : హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అపోహలు తొలగిపోవాలని, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపకూడదని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శాంత రాజ్, స్పందన జానపద కళారంజని రమేష్ అన్నారు. ఎయిడ్స్ పై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని రైల్వే స్టేషన్ ఆవరణలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

నిబంధనలు పాటించాలి

తొర్రూరు : ప్రైవేటు ఆస్పత్రుల యజమాన్యాలు నిబంధనలు పాటించాలని మాతా శిశు సంక్షేమ శాఖ ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ సారంగం అన్నారు. డివిజన్ కేంద్రంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను గురువారం అధికారులు సందర్శించి, రికార్డులు పరిశీలించారు.

తొర్రూరు రూరల్ : మండలంలోని పోలెపల్లి గ్రామ శివారు చంద్రుతండాలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది తండాకు వెళ్లకుండా సీజనల్ వ్యాధులను అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని గురువారం ఏఎన్ఎం, ఆశ వర్కర్లకు తొర్రూరు వైద్యాధికారి జ్వలిత మెమోలు జారీ చేశారు.

కస్తూర్బాలో ఉపాధ్యాయ దినోత్సవం

దోర్నకల్ : కస్తూర్బా బాలికల విద్యాలయంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. భారీ వర్షాలతో వాయిదా పడిన వేడుకలను పాఠశాల ప్రత్యేక అధికారి ఎస్‌కే మున్నీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే పదవి విరమణ పొందిన కుక్‌తో పాటు రాత్రిపూట పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న తాత్కాలిక ఉద్యోగిని సిబ్బంది సన్మానించి ఆర్థిక సాయం అందించారు.

దుస్తుల పంపిణీ

దంతాలపల్లి : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు చేయూత ఇవ్వడమే గ్రేస్ సొసైటీ సర్వీస్ లక్ష్యమని ఆ సంస్థ ప్రతినిధి శ్రీ వేణు అన్నారు. మండలంలోని దంతాలపల్లి, పెద్దముప్పారం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు దుస్తువులను పంపిణీ చేశారు.

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వండి



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న పుల్లయ్య



బుక్స్ అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

● మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య

మరిపెడ రూరల్ : మండలంలోని ముంపునకు గురైన సీతారాం తండాను సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి బాధితులకు సురక్షితమైన ప్రదేశంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామన్న హామీని తక్షణమే అమలు చేయాలని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం సీతారాంతండాను టీడీపీ బృందం సభ్యులు సందర్శించారు. 56 కుటుంబాలను బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు. ఎండీ హీమామ్, తాత మధులత, పేరం వీరస్వామి, చందా మధు, ధర్మ రాజుల శంకర్, జయ తదితరులు పాల్గొన్నారు.

స్టేషనరీ పంపిణీ

వరద ముంపునకు గురైన సీతారాం తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తెలుగు సమితి ఆఫ్ నేబ్రాస్కా, స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ సమితి ఆధ్వర్యంలో గురువారం స్టేషనరీ పంపిణీ చేశారు. హెచ్ఎం భరత్, సంస్థ బాధ్యులు రామసహాయం శ్రీధర్ రెడ్డి, మేకల కృష్ణయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడిపై దాడి

బయ్యారం : మండల కేంద్రానికి చెందిన చల్లా గోవర్ధన్ గురువారం బస్టాండ్ సెంటర్‌కు వెళ్లగా అంబేడ్కర్ నగర్‌కు చెందిన అలెగ్జాండర్, రాజశేఖర్‌లు పని ఉందని పిలిచారు. ఈ క్రమంలో గోవర్ధన్ వారి వద్దకు వెళ్లగా అతనిపై దాడి చేసినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. దాడి చేస్తుండగా స్థానికులు రావటంతో అక్కడి నుంచి పరారయ్యారు. ఈ విషయంపై బాధితుడు గోవర్ధన్ విలేకరులతో మాట్లాడుతూ..బయ్యారం సొసైటీలో జరిగిన అక్రమాలపై సోషల్‌మీడియాలో పెట్టారనే కోపంతో సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి తనపై దాడి చేశారన్నారు. తనకు మధుకర్‌రెడ్డి, అలెగ్జాండర్, రాజశేఖర్ ద్వారా ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలన్నారు. ఈ విషయంపై గోవర్ధన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆకతాయిలకు కౌన్సెలింగ్

నర్సింహులపేట : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల వద్ద బైక్, ఆటోల్లో వచ్చి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఆకతాయిలను ఎస్సై మాలోత్ సురేష్ గురువారం సాయంత్రం మఫ్టీలో విచ్చేసి ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. ఆటోలలో ఉన్న సౌండ్ బాక్స్‌లను స్వాధీనం చేసుకొని వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

రైలు ఢీకొని ఐదు గొర్రెలు మృతి.. కాపరికి తీవ్రగాయాలు



కేసముద్రం : ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఐదు గొర్రెలు మృత్యువాత పడగా, కాపరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. ముడుపుగల్ గ్రామానికి చెందిన కల్లెంచర్ల గంగమల్లు గొర్రెలను మేపేందుకు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో కేసముద్రం–తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య రైల్వే ట్రాక్‌ను గొర్రెలను దాటిస్తుండగా, అప్పటికే అప్‌లైన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు వస్తుంది. దీంతో గొర్రెలను కాపాడే ప్రయత్నం చేయగా, రైలు ఢీకొనడంతో కాలు విరిగిపోయి, నడుముకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో మొత్తం ఐదు గొర్రెలు మృతి చెందగా, రెండు గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని 108లో మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు.

టేకు కలప పట్టివేత

కొత్తగూడ : అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను అటవీ శాఖ అధికారులు మండలంలోని జంగవాని గూడెం సమీపంలో గురువారం ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్ఆర్వో వజ్రహత్ తెలిపిన వివరాల ప్రకారం కొందరు వ్యక్తులు టేకు కలపను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఓటాయి సెక్షన్ సిబ్బంది తో కలసి ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. 32 టేకు మొద్దులు తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వాటి విలువ సుమారు రూ.40వేలు ఉంటుందని తెలిపారు.

నంబర్ ప్లేట్ లేకుంటే కేసు నమోదు



గూడూరు : నంబర్ ప్లేట్, పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే 420 కేసు నమోదు చేస్తామని సీఐ కె.బాబూరావు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎలాంటి పత్రాలు లేకుండా, నంబర్ ప్లేట్ క్లియర్‌గా లేని 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ పత్రాలు, నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపిస్తూ ప్రమాదవశాత్తు జరిగే ప్రమాదాలలో ప్రాణ నష్టం జరుగుతుందన్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలకు సరైన పత్రాలు, నంబర్ ప్లేట్‌లు పరిశీలించి, అవసరమైతే జరిమానా విధించి వాహనాలు అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, బ్లూ కోర్టు టీం బృందం పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నెహ్రూసెంటర్ / గంగారం : ఆదివాసీ మహిళపై అత్యాచారం చేసి దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు తాటి సుధాకర్ గురువారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలానికి చెందిన ఆదివాసీ మహిళపై అత్యాచారం చేసి ఈ విషయాన్ని ఎక్కడ చెప్పొద్దంటూ సదరు మహిళను హత్య చేయాలని పథకం వేశారన్నారు. ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ నిందితుడిని కఠినంగా శిక్షించాలని అన్నారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలానికి చెందిన ఆదివాసీ మహిళపై ముస్లిం కులానికి చెందిన ఆటో డ్రైవర్ అఘాయిత్యాన్ని ఖండిస్తూ బాధితులకు న్యాయం చేయాలని ఈనెల 21న తుడుందెబ్బ ఆధ్వర్యంలో రాష్ట్ర బంద్‌కు తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ ఆగబోయిన రవి పిలుపునిచ్చారు. అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు. నాయకులు ఈక విజయ్‌కుమార్, అల్లెం జంపయ్య, వజ్జ జేయందర్, శిడం రమేష్, పుల్సాం మునేష్, ఇరుప పవన్, బూర్క పవన్, వాసం రవి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



మహబూబాబాద్ అర్బన్: మాట్లాడుతున్న రాంజీ



కురవి: మాట్లాడుతున్న యాకూబ్

మహబూబాబాద్ అర్బన్ : గిరిజన, ఆదివాసీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి భూక్య రాంజీనాయక్ అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని ముత్యాలమ్మ గూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో గురువారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంజీ నాయక్ మాట్లాడుతూ..గిరిజన ఆశ్రమ పాఠశాలలో సీఆర్టీ, రెగ్యులర్ ఉపాధ్యాయుల సమస్యలను జిల్లా గిరిజన డిప్యూటీ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బానోత్ బాలాజీ కుమార్, గుగులోత్ చిట్టిబాబు, రవీందర్, హెచ్ఎం కోటీశ్వరి, ఉపాధ్యాయులు భాగ్యమ్మ, శకుంతలబాయి, ధనలక్ష్మి, కవిత, మొగిలయ్య, భద్రు, హుస్సేన్, శ్రీను, పీడీ అశోక్, వార్డెన్ జయసుధ పాల్గొన్నారు.

ప్లేస్కూల్ విధానం సరికాదు

కురవి : అంగన్‌వాడీ కేంద్రాలను ప్లే స్కూల్స్‌గా మార్చి మూడోతరగతి వరకు నిర్వహించాలనే ప్రభుత్వ ప్రతిపాదన సరైంది కాదని, వెంటనే ఆ విధానాన్ని విరమించుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే యాకూబ్ అన్నారు. గురువారం సీరోలు మండలంలోని కాంపల్లి, కొత్తూరు(సీ), చింతపల్లి, సీరోలు, ఉప్పరిగూడెం తదితర గ్రామాల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. వి.భాస్కర్‌రావు, జె.కృష్ణాకర్‌రెడ్డి, జి.బాలు నాయక్, కె.శంకర్, ఎం.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హులకు విద్యుత్ మీటర్లు ఇవ్వాలి

● మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్ : గృహజ్యోతి పథకంలో అర్హులైన పేదలకు విద్యుత్ మీటర్లు ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అఫిడవిట్, సెల్ఫ్ డిక్లరేషన్‌తో మాత్రమే కేవలం రూ.938కే విద్యుత్ మీటర్ ఇవ్వాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో చాలా ఇళ్లకు నంబర్లు లేవని, వాటి విషయంలో ఈ పథకంలో వారందరికీ మీటర్లు ఇవ్వాలన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, నాయిని రంజిత్, కౌన్సిలర్‌లు చిట్యాల జనార్దన్, ఎడ్ల వేణుమాధవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మీటర్లు అందించేలా చర్యలు

నెహ్రూసెంటర్ : మున్సిపల్ పరిధిలో నంబర్లు లేని ఇళ్లకు విద్యుత్ మీటర్లు అందించేలా చర్యలు తీసుకోనున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ జె.నరేష్ గురువారం తెలిపారు. అఫిడవిట్ ఆధారంగా మీటర్లు అందించాలని ఆదేశాలు వచ్చాయని ఆయన వెల్లడించారు. అలాగే వరదల కారణంగా కొట్టుకుపోయిన, ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల పునరుద్ధరణకు విద్యుత్‌శాఖ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి జిల్లాకు రూ.3 కోట్ల అదనపు నిధులను విడుదల చేశారని ఎస్ఈ జె.నరేష్ తెలిపారు.

నిధుల దుర్వినియోగంపై ఫోర్జరీ కేసు

● స్టేషన్‌కు తీసుకొచ్చిన ఎస్సై
● చెప్పకుండా వెళ్లిపోయిన మాజీ సర్పంచ్

కురవి : మహబూబాబాద్ మండలంలోని ఇస్లావత్ తండా మాజీ సర్పంచ్ ఇస్లావత్ నరేష్.. మాజీ ఉప సర్పంచ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు అభియోగం మోపబడింది. దీంతో అప్పటి డీపీఓ నరేశ్‌పై ఫిర్యాదు చేశారు. కాగా ఫోర్జరీకి సంబంధించిన ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ ఈనెల 18న(బుధవారం) వచ్చింది. ఈ మేరకు కురవి ఎస్సై సతీష్ గురువారం తండాకు వెళ్లి మాజీ సర్పంచ్ నరేష్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. పోలీసులు తమ పనిలో నిమగ్నమై ఉన్న సమయంలో నరేష్ ఎవరికి చెప్పపెట్టకుండా స్టేషన్ ఆవరణ నుంచి బయటకు వచ్చి వెళ్లిపోయాడు. అతని కోసం పోలీసులు వెతికగా, ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. ఈ సంఘటనపై ఎస్సై సతీష్‌ను వివరణ కోరగా ఫోర్జరీ కేసులో నరేష్‌ను స్టేషన్‌కు తీసుకొచ్చామని, చెప్పా పెట్టకుండా బయటకు వెళ్లిపోయాడని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

పరిసరాల శుభ్రత పాటించాలి

డోర్నకల్ : పరిసరాల శుభ్రతను పాటించాలని చిలుకోడు ప్రత్యేక అధికారి వీరభద్రరావు కోరారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా గురువారం గ్రామంలో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

మహబూబాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రంలోని బాలికల కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ స్వాతి, పర్వీన్ బేగం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలపై ఎమ్మెల్యే స్పందించాలి

మహబూబాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల శిథిలావస్థలో చేరుకుకుందని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ స్పందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. ఈమేరకు గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

వైద్యశిబిరం

పెద్దవంగర : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని పల్లె దవాఖాన వైద్యులు రాజ్ కుమార్ సూచించారు. గురువారం మండలంలోని వడ్డెకొత్తపల్లిలో వైద్యశిబిరం నిర్వహించారు. 50 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

ఆర్థికసాయం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపల్ 16వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ బానోత్ వెంకట్రాం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని గురువారం పలువురు నేతలు పరామర్శించి రూ.50 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

తొర్రూరు రూరల్ : మండలంలోని అరిపిరాలకు చెందిన సుంచు సోమక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా గురువారం సోమక్క చిత్రపటానికి నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కోటూరి మానవతారాయ్ పూలమాలలు వేసి నివాళులర్పించి పరామర్శించారు.

సెంట్రల్ లైటింగ్ వెలుగులు

నర్సింహులపేట: మండల కేంద్రంలో నాలుగు హైమాస్ట్ లైట్లు(సెంట్రల్ లైటింగ్స్) ఏర్పాటు చేయనున్నారు. వేంకటేశ్వస్వామి దేవస్థానం దగ్గర, అంబేడ్కర్ సెంటర్, వైన్ షాపు వద్ద, పాత ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటుకు ప్రొసీడింగ్ వచ్చినట్లు అధికారుల తెలిపారు. అయితే వైన్‌షాపు వద్ద ఏర్పాటు చేయొద్దని గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు. ఇదిలా ఉండగా గురువారం సాయంత్రం అంబేడ్కర్ సెంటర్, దేవస్థానం వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు.

ముస్లిం యువతులకు పెళ్లి కానుకలు..



మరిపెడ రూరల్ : ఖమ్మం, సూర్యాపేట జిల్లాల నిరుపేద ముస్లిం కుటుంబాలకు చెందిన యువతులకు మరిపెడ పట్టణానికి చెందిన కేకే ఇన్‌ఫ్రా, రియల్ ఎస్టేట్ అండ్ కన్‌స్ట్రక్షన్ ఖలీల్, ఖాదర్ బ్రదర్స్ చేయూతనిచ్చారు. ఈ సందర్భంగా గురువారం మరిపెడ మున్సిపాలిటీలోని హౌజింగ్ బోర్డు మసీద్ యే రహమానియాలో ఇద్దరు యువతులకు రూ.50 వేలు విలువైన ఫర్నిచర్, పెళ్లి సామగ్రిని అందజేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గాన్ని అభినందిస్తున్న ప్రతినిధులు

తొర్రూరు : లయన్స్ క్లబ్ ఆఫ్ టీచర్స్ తొర్రూరు నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి తెలిపారు. నూతన అధ్యక్షుడిగా చింతల సురేష్, ప్రధాన కార్యదర్శిగా సురేష్ కుమార్, కోశాధికారిగా ఎద్దు వెంకన్నతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

మున్నూరుకాపు సంఘం జిల్లా ఇన్‌చార్జ్‌గా చందాగోపి

కేసముద్రం: మున్నూరు కాపు సంఘం వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా మండలానికి చెందిన చందాగోపి ఎన్నికై నట్లు రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ పుటం పురుషోత్తంరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చందాగోపి మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఆయన అన్నారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ..



ఈక ఆదినారాయణ



గండి ఉదయ్

గూడూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో గురువారం టీపీటీఎఫ్ సర్వసభ్య సమావేశంలో సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈక ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శిగా గండి ఉదయ్, ఉపాధ్యక్షులుగా గట్టు నర్సయ్య, జి.రాణి, కార్యదర్శులుగా ఊక శ్రీనివాస్, రాణి, మహేందర్ ఎన్నికైనట్లు చుంచు శ్రీశైలం, సోమ విష్ణువర్ధన్ తెలిపారు.